# ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- సైనిక లాంఛనాలతో లాన్స్‌నాయక్ గంగాప్రసాద్ అంత్యక్రియలు
- బోధన్ నుంచి కుమ్మన్‌పల్లి వరకు భారీ ర్యాలీ
- నివాళులర్పించిన కలెక్టర్, సీపీ, ప్రజాప్రతినిధులు, నాయకులు
- స్థానికులను కంటతడి పెట్టించిన భార్య శిరీష, తల్లిదండ్రుల రోదనలు



గంగాప్రసాద్ పార్థివదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ఆర్మీవ్యాన్



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



గంగాప్రసాద్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న భార్య శిరీష



సైనిక లాంఛనాల్లో భాగంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ సిబ్బంది

బోధన్, అక్టోబర్ 8 : సిక్కిం వరదల్లో సాలూరా మండలం కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీజవాన్ నీరడి గంగాప్రసాద్ గల్లంతై మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం గ్రామానికి భౌతికకాయం చేరుకోగా.. గ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వేలాది మంది అశ్రునయనాల మధ్య వీరజవాన్ అంతిమ యాత్ర కొనసాగింది.

పశ్చిమబెంగాల్ ఆర్మీ క్యాంప్ నుంచి భారత–చైనా సరిహద్దుకు విధి నిర్వహణలో భాగంగా గంగాప్రసాద్ ఉన్న సైనిక బృందం 20 రోజుల క్రితం వెళ్లింది. ఇందులో భాగంగా ఉత్తర సిక్కింలోని తీస్తా నది తీరాన లాచెన్ లోయ వద్ద ఈ నెల 3న అర్ధరాత్రి ఆకస్మికంగా సంభవించిన వరదల్లో గంగాప్రసాద్‌తోపాటు 23 మంది గల్లంతయ్యారు. సైన్యంలో లాన్స్‌నాయక్ హోదాలో పనిచేస్తున్న గంగాప్రసాద్ భౌతికకాయం గురువారం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం శనివారం గంగాప్రసాద్ పార్థివదేహాన్ని ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడినుంచి ఆదివారం ఉదయం స్వగ్రామమైన సాలూరా మండలం కుమ్మన్‌పల్లికి సైనిక అధికారులు మిలటరీ వాహనంలో తీసుకువచ్చారు. బోధన్ పట్టణ శివారులో గంగాప్రసాద్ భౌతికకాయం కోసం వేలాది మంది జాతీయజెండాలను పట్టుకొని ఎదురుచూశారు. భౌతికకాయం రాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బోధన్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి నాగన్‌పల్లి, సాలూరా క్యాంప్ గ్రామాల మీదుగా కుమ్మన్‌పల్లి గ్రామానికి తీసుకువెళ్లారు. ప్రజలు మోటార్ సైకిళ్లపై కుల, మతాలకు అతీతంగా జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. బోధన్ నుంచి కుమ్మన్‌పల్లి వరకు కొనసాగిన ర్యాలీలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దారిపొడవునా గంగాప్రసాద్ పార్థివదేహానికి పూలు చల్లుతూ నివాళులర్పించారు. ర్యాలీలో గంగాప్రసాద్ అమర్ రహే.. వీర జవాన్ అమర్ రహే.. అంటూ నినాదాలు మిన్నంటాయి.

### సైనిక లాంఛనాలతో..

ఆర్మీజవాన్ గంగాప్రసాద్ అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో నిర్వహించారు. గంగాప్రసాద్ అంత్యక్రియల సందర్భంగా సైనికులు గాలిలోకి కాల్పులు జరిపి వందనం చేశారు. సైనికులు గంగాప్రసాద్ పాడెను శ్మశానవాటిక వరకు మోశారు.

### మిన్నంటిన రోదనలు..

గంగాప్రసాద్ పార్థివదేహం కుమ్మన్‌పల్లికి చేరుకోగానే ఆయన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. భార్య శిరీష, తల్లి సరూబాయి, తండ్రి కాశీరాం, కుటుంబసభ్యులను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. భార్య శిరీష రోదన స్థానికులను కంటతడి పెట్టించింది. అంతిమయాత్ర ప్రారంభం కాగానే గంగాప్రసాద్ భౌతికకాయానికి భార్య శిరీష సెల్యూట్ చేసి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

### నివాళులర్పించిన కలెక్టర్, సీపీ, ప్రజాప్రతినిధులు, నాయకులు

గంగాప్రసాద్ భౌతికకాయంపై కలెక్టర్ రాజీవ్ హన్మంతు, సీపీ సత్యనారాయణ, సైనికాధికారులు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు బాధిత కుటుంబాన్ని కలెక్టర్ పరామర్శించి ఓదార్చారు. అంతిమయాత్రలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రమేశ్, డీసీపీ జయరాం, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, గోగినేని నర్సయ్య, సాలూరా షకీల్, అల్లె జనార్దన్, వివిధ పార్టీల నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వి.మోహన్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, గంగాశంకర్, కుమ్మన్‌పల్లి సర్పంచ్ కోర్భ గంగాధర్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి వేములకు ఏకగ్రీవాల వెల్లువ

**మున్నూరు కాపు, మత్స్య, భూక్యా గిరిజన, మేరు, దేవాంగ సంఘాల కుటుంబాలు**



కోనాపూర్‌లో మంత్రి వేములకు మద్దతుగా తీర్మాన కాపీని అందజేస్తున్న మున్నూరు కాపు సంఘ సభ్యులు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 8 : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వివిధ కులసంఘాల మద్దతు వెల్లువెత్తుతున్నది. బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు కుల సంఘాల సభ్యులు ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేసి తమ మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మంత్రి వేములను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తీర్మానం చేశారు.

కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్, కేసీ తండాలో మంత్రి వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. మున్నూరుకాపు, మత్స్యకార, భూక్యా గిరిజన సంఘాలకు చెందిన 166 కుటుంబాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. కోనాపూర్, కేసీ తండా మున్నూరుకాపు సంఘానికి చెందిన 68 కుటుంబాలు, మత్స్యకార సంఘానికి చెందిన 52 కుటుంబాలు, భూక్యా గిరిజన సంఘానికి చెందిన 46 కుటుంబాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. తీర్మాన కాపీలను స్థానిక నాయకులు పెరుమాండ్ల రాజాగౌడ్, దయాదేవయ్య, లకావత్ గంగాధర్, సంతోష్‌నాయక్, జలంధర్, బడాల రమేశ్, టేకుల రాజు, రమేశ్‌రెడ్డి, గంగాధర్, జాల రాజుకు అందజేశారు.

### భీమ్‌గల్‌కు చెందిన 127 మేరు కుటుంబాలు

భీమ్‌గల్, అక్టోబర్ 8: మంత్రి వేములకు భీమ్‌గల్‌లోని మేరు కులానికి చెందిన 127 కుటుంబాలు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశాయి. మేరు సంఘ భవనంలో కులస్తులు ఆదివారం సమావేశమై మద్దతు తెలుపుతూ బాండ్ పేపర్‌పై తీర్మానం రాసి సంతకాలు చేశారు. బాండ్ పేపర్‌ను రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు కన్నె సురేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు నర్సయ్య, సతీశ్, బీఆర్‌ఎస్ నాయకుడు ఇక్రమ్, మేరు సంఘం మండల అధ్యక్షుడు రామగిరి శ్రీనివాస్, సభ్యులు కొట్టూరు మనోజ్, గణేశ్, సుదర్శన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### వేల్పూర్‌లో దేవాంగ సంఘం సభ్యులు..

వేల్పూర్, అక్టోబర్ 8: మండలకేంద్రంలోని దేవాంగ సంఘానికి చెందిన 54 కుటుంబాలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. తీర్మాన కాపీని బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్‌కు అందజేశారు.

### వడ్యాట్ గురడి కాపు వృద్ధ సంఘం సభ్యులు..

మోర్తాడ్, అక్టోబర్ 8: మండలంలోని వడ్యాట్ గ్రామానికి చెందిన గురడి కాపు వృద్ధ సంఘంలోని 25 మంది సభ్యులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గంధం మహిపాల్, వెల్మ రవీందర్ పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ




ర్యాలీని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 8 : క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌లో భాగంగా నగరంలో ఇందూరు క్యాన్సర్ దవాఖాన, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవేర్‌నెస్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్టఅతిథులుగా డాక్టర్ అజయ్‌కుమార్, అభినవ్ సర్దార్, లోహిత్ కుమార్, డాక్టర్ ప్రతిమారాజ్ హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కిరణ్‌కుమార్ హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నగరంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగి పూలాంగ్ చౌరస్తాకు చేరుకున్నది. అక్కడ జాతీయ గీతాన్ని ఆలపించారు. డాక్టర్ అజయ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్వంలో టీషర్టులను పంపిణీ చేశారు. ర్యాలీకి ముందు వార్మప్, జుంబా ఉత్సాహపర్చాయి. ర్యాలీలో ఇందూర్ క్యాన్సర్ దవాఖాన మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రద్యుమ్నారెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, మేనేజర్ మునీందర్‌రెడ్డి, సిబ్బంది, లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్, వసుధ ఫౌండేషన్, ఎస్‌సీసీ, మేఘన డెంటల్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్, బీబీసీ హైస్కూల్, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి

డిచ్‌పల్లి, అక్టోబర్ 8 : విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచంలో సాఫ్ట్‌వేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో వచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి అన్నారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో 'బెస్ట్ టీచర్స్ అవార్డ్ సెరెమనీ– 2023' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై 150 మంది ఉత్తమ టీచర్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో చాలా త్వరగా అభివృద్ధి చెందుతున్నదని, త్వరలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలుస్తుందని అన్నారు. దేశంలో ఏటా 14 లక్షల మంది ఇంజినీర్లు తయారవుతున్నారని తెలిపారు. ఒక పరిశ్రమ లేదా కంపెనీ ప్రారంభించాలంటే యువత గతంలో వెనుకంజ వేసేవారని, ఇప్పుడు స్టార్టప్‌ల పేరుతో ఎన్నో కంపెనీలు ప్రారంభిస్తున్నారని వివరించారు. 2016లో దేశంలో 450 స్టార్టప్‌లు ఉండగా.. ప్రస్తుతం లక్షకు పైగా ఉన్నాయని వెల్లడించారు.

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల ప్రవేశాలసంఖ్య పెరిగిందన్నారు. ఎంసెట్‌లో ఈసారి కనీవిని ఎరుగని రీతిలో 2.31 లక్షలకుపైగా విద్యార్థులు రాయగా.. ఇందులో ఎక్కువగా కంప్యూటర్ కోర్సుల్లో చేరినట్లు తెలిపారు. కొత్త సిలబస్ ప్రకారం విద్యార్థులు మూడు రోజులు కళాశాలలో, మరో మూడు రోజుల్లో కంపెనీలు, పరిశ్రమల్లో పని చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బీఎస్సీ హానర్స్ కోర్సు ప్రవేశపెట్టామన్నారు. ఉన్నతవిద్యలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ప్రధానకార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు జయసింహగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.గంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మానస గణేశ్, ధర్మరాజు, రాష్ట్ర సలహాదారుడు మామిడాల మోహన్, జిల్లా కార్యదర్శి ఆర్‌ఏ జనార్దన్, కోశాధికారి నిత్యానందం, జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, కన్వీనర్ సుందర్, ట్రస్మా మండల అధ్యక్షుడు జీనియస్ గంగారెడ్డి, డివిజన్ ప్రతినిధులు విక్రాంత్, తేలు గంగాధర్ పాల్గొన్నారు.